సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి



భద్రత కల్పించాలి

ఆస్పత్రికి ఎంతోమంది రోగులు వస్తారు. వారిని కుటుంబ సభ్యుల్లా భావించి సేవలు అందిస్తున్నాం. వారి ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్న మాపై దాడులు చేయడం సరికాదు. వైద్యసిబ్బందికి భద్రత కల్పించాలి. ఏ ప్రాంతమైనా ఇది తప్పనిసరి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వైద్య, ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– బి.అనిత, స్టాఫ్ నర్స్, తాళ్లవలస పీహెచ్‌సీ, భీమిలి మండలం



బాధ్యతతో మెలగాలి



మేం ఒక్కోసారి 24 గంటలు సేవలు అందిస్తుంటాం. అత్యవసర సమయాలు, రాత్రి వేళల్లో వైద్యసేవలు అందించడం సవాళ్లతో కూడుకున్న అంశం. ప్రమాదాల బారిన పడిన వారికి, గుండెపోటుకు గురయ్యేవారికి ప్రాధాన్యతను బట్టి సేవలు అందిస్తాం. బాధిత కుటుంబ సభ్యులు అర్థం చేసుకోకుండా గొడవలకు దిగుతుంటారు. అందరూ బాధ్యతతో మెలగాలి.


– ఎం.ఎర్రితల్లి, ఏఎన్‌ఎం, లక్ష్మీపురం, భీమిలి మండలం

మట్టి గణపతికే జై

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు బైబై
- ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- సంతపేట కుమ్మరివీధిలో వేలల్లో విగ్రహాల తయారీ



గజరాజుపై గజముఖుడు



శివలింగానికి అభిషేకం చేస్తున్న గణనాథుడు



మట్టితో అచ్చు వేసిన చిన్న విగ్రహాలు

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాలు సమీపించడంతో గణపతి విగ్రహాలు చూడచక్కగా రూపుదిద్దుకుంటున్నాయి. వర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో మట్టి వినాయకుల ప్రతిష్ఠకే మొగ్గు చూపుతున్నారు నిర్వాహకులు. దీంతో మట్టితో విభిన్న ఆకృతుల్లో కొలువుదీరేందుకు పార్వతీనందనుడు సిద్ధమవుతున్నాడు.

రెండు నెలల నుంచి తయారీ..

మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేట కుమ్మరివీధికి చెందిన అరటికోట్ల గణేష్, అరటికోట్ల రాము, పొట్నూరు ప్రసాద్ అనే ముగ్గురు యువకులు రెండు నెలల క్రితమే మట్టి గణపతుల తయారీకి శ్రీకారం చుట్టారు. ఆర్డర్లను బట్టి ఉత్సవ కమిటీల ప్రతినిధుల అభిరుచి మేరకు 2 నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ మట్టి విగ్రహాలకు ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ నుంచి మేలైన చెరువు మట్టి, ఊక, వరిగడ్డి కర్రలను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈ విగ్రహాలు రూ.2వేలు మొదలుకుని రూ.25వేల వరకు ధరల్లో లభ్యమవుతున్నాయి.

శొంఠ్యాం మట్టితో..

సాధారణంగా మట్టి బొమ్మ పూర్తిగా తయారు కావడానికి ఒక నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ఈ క్రమంలో కొన్ని బొమ్మలు జారిపడుతుంటాయి. దీనికోసం వీటికి పలుమార్లు మెరుగులు దిద్దవలసి వస్తుంది. దీంతో 2 నుంచి 4 అడుగుల వరకు బొమ్మలను బరువు తగ్గించి అచ్చులు వేస్తున్నారు. తమకు కావలసిన గణపతి విగ్రహాన్ని తీసుకుని ముందు, వెనుక పీవోపీతో సొంతంగా అచ్చులు తీసుకుంటున్నారు. ఈ అచ్చులతో తేలికగా మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు. 4 నుంచి 12 అడుగుల విగ్రహాలను మాత్రం రోజుల తరబడి ఆరబెట్టి కోరిన విధంగా సిద్ధం చేస్తున్నారు. సరుగుడు కర్రలకు వరిగడ్డి, ఖురద పూసి తరువాత ఊక కలిపిన మట్టితో విగ్రహాలు పూర్తి చేస్తున్నారు. విగ్రహం ఆరేకొద్దీ బరువు తగ్గుతుంది. భీమిలిలో చాలావరకు చెరువులు కలుషితమై పోయినందున శొంఠ్యాం చెరువు మట్టిని మాత్రమే వినియోగిస్తున్నారు. ఉత్తరాంధ్రలో చాలా వరకు మట్టిబొమ్మల తయారీదారులు కాస్తయినా పీవోపీని వినియోగిస్తుండగా సంతపేటలో కల్తీ లేని మట్టిని ఉపయోగిస్తున్నారు.

పీవోపీకి చెక్ పెడుతూ..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాలు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయి. పైగా ఈ విగ్రహాలు రోజులు, నెలల తరబడి చెరువులు, నదులు, సముద్రాల్లో కరగకుండా ఉండిపోవడంతో నీరు కలుషితమవుతోంది. దీంతో ఆ నీటిలో ఉన్న జీవుల మనుగడకు ప్రమాదం వాటిల్లుతోంది. ఉత్సవాలు ముగిసిన తరువాత అనుపు విగ్రహాల వ్యర్థాలతో తీరప్రాంతాలు జుగుప్సాకరంగా మారుతున్నాయి. ఈ కారణంతో ఇళ్లల్లో, మండపాలలో మట్టి గణపతులను పూజించడానికి జనం సన్నద్ధమవుతున్నారు.



మట్టి విగ్రహానికి వాటర్ కలర్ వేస్తున్న తయారీదారుడు

గతంలో మట్టి బొమ్మలు మిగిలిపోయేవి..



గతంలో తయారు చేసిన మట్టిబొమ్మలు మిగిలిపోయేవి. దశాబ్ద కాలంగా పర్యావరణంపై చాలామందికి అవగాహన పెరిగి మట్టి బొమ్మలే అడుగుతున్నారు. ఉత్సవ కమిటీలు కోరిన డిజైన్లలో తయారు చేస్తున్నాం. దుర్గాదేవి విగ్రహాలు కూడా ఆర్డర్లపై తయారు చేస్తున్నాం. మట్టిబొమ్మల కోసం 83319 36098, 80081 25338 నంబర్లలో సంప్రదించవచ్చు.

– అరటికోట్ల రాము, తయారీదారుడు, సంతోపేట

క్లుప్తంగా

30న ఆశీలు వసూలు వేలం

భీమునిపట్నం: భీమిలి మూడో వార్డులో ఆశీలు వసూలుకు సంబంధించిన వేలం పాటలను అనివార్య కారణాల వల్ల 30వ తేదీకి వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. ఇక్కడ రోడ్డు మార్జిన్, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు, లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్ మొదలైన వాటిల్లో ఆశీలు వసూలు చేసుకోవడానికి, బీచ్ సమీపంలో షాపుల నిర్వహణకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆరోజు ఉదయం 11గంటలకు జోనల్ కార్యాలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

కమిషనర్ దృష్టికి ఏడో వార్డు సమస్యలు



కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ: జీవీఎంసీ ఏడో వార్డులో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధికి తోడ్పడాలని వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పిల్లా మంగమ్మ కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ని కలసి వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో కాల్వల నిర్మాణం, రహదారుల మరమ్మతులు, వీధిలైట్లు, బోర్ల నిర్మాణం తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకటరావు ఉన్నారు.

వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం పరిధి కాపులదిబ్బడపాలెంలో శ్రీ విజయ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారిని స్థానిక మహిళలు తీసుకువచ్చిన గంగాజలంతో అభిషేకించి, అలంకరించారు. విఘ్నేశ్వరుని పూజ, మండపారాధన, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, ఆలయ ధర్మకర్త వాసుపల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు సమష్టిగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండి అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి సమష్టిగా కృషి చేద్దామని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ పిలుపునిచ్చారు. బుధవారం ఉక్కు ప్రధాన సమావేశ మందిరంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక స్థితిని నిరంతరం మెరుగుపరచడానికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలో భాగంగా ఉత్పత్తి పెంపు, వ్యయ నియంత్రణ చర్యలను అమలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇందుకు అధికారులు, కార్మికులు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి. పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్‌తో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన యువతులకు ధ్రువపత్రాలు



ధ్రువీకరణ పత్రాలతో శిక్షణ పొందిన యువతులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పొందిన యువతులు స్వయం ఉపాధి ద్వారా మంచి ఆదాయాన్ని పొందుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ అన్నారు. కేంద్రంలో బ్యూటీ థెరపిస్ట్, కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన యువతులకు బుధవారం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ నిరుద్యోగ యువతులకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. మహిళల స్వయం ఉపాధికి అవసరమైన కోర్సుల్లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ గౌరి మాట్లాడుతూ ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్ బి.అన్నపూర్ణ, శిక్షకురాలు ముంతాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



జర్మనీ సంస్థ ప్రతినిధులతో ఆర్జేడీ విజయ భాస్కర్

పద్మనాభం: సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ ఆర్జేడీ కె.విజయ భాస్కర్ ఆదేశించారు. మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించాలని సూచించారు. పాఠశాలలోని గ్రంథాలయంలో విద్యార్థులతో రోజూ ఒక పీరియడ్ చదివించాలని, విద్యార్థులకు పుస్తకపఠనం అలవాటు చేయాలని అన్నారు. విద్యార్థులతో ప్రయోగశాలలో ప్రయోగాలు చేయించాలని సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేలా మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి, మధ్యాహ్న భోజనం పెట్టాలని తెలిపారు. విద్యార్థులు భోజనం చేసినప్పుడు సంబంధిత తరగతి ఉపాధ్యాయులు అక్కడే ఉండి, భోజనం చేసే పద్ధతిని అలవాటు చేయాలన్నారు. కంప్యూటర్ విద్య పరంగా ప్రభుత్వ పాఠశాలలను మరింత ప్రోత్సహించాలన్నారు.

జర్మనీ సంస్థ ప్రతినిధులతో భేటీ

పాఠశాలలో జర్మనీకి చెందిన డబ్ల్యూఎస్‌ఎస్ సంస్థ ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఆర్జేడీ పరిశీలించారు. ల్యాబ్‌ను పరిశీలించడానికి వచ్చిన సంస్థ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలను చర్చించారు. సమావేశంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ వద్ద నిరసన తెలియచేస్తున్న ఉపాధ్యాయులు



నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ వద్ద నిరసన తెలియచేస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ విద్యను నాశనం చేసే జీవో 84, పాఠశాల విద్యను నాశనం చేసే జీవో 117లను రద్దు చేయాలని ఈ నిరసన చేపట్టినట్టు తెలిపారు. సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్, విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, సంగివలస ఈడబ్ల్యూఎస్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమాల్లో ఏపీ ఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అమర్‌నాథ్, భీమిలి ఎంటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, వై.ప్రతాప్‌సింగ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిలిలో..

జీవో నంబర్ 84, 117లను రద్దు చేయాలని కోరుతూ భీమిలిలోని మున్సిపల్ హైస్కూల్, పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. ఏపీ ఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.వి.ఎస్.చంద్రరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చెట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా షేక్ నూర్జహాన్

కొమ్మాది/మహారాణిపేట: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా షేక్ నూర్జహాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ అంధ బాలికల విద్యాభివృద్ధికి, వారి మానసిక పరిణతికి కృషి చేస్తానని తెలిపారు. ఆమె కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్కను అందించారు.

గాలి.. వాన

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: భీమిలి పరిధిలో బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉరుములు, మెరుపులు, గాలితో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజా జీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా విద్యాసంస్థల నుంచి ఇంటికి చేరుకునే సమయం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్కెట్‌లో లావాదేవీలకు బ్రేకులు పడ్డాయి. ఏకధాటిగా కురిసిన వర్షానికి పలుచోట్ల డ్రైనేజీలు నిండి రహదారులపై మూడు అడుగుల మేర వర్షం నీరు ప్రవహించింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. సాయంత్రం 7 గంటల తరువాత వర్షం శాంతించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పద్మనాభంలో..

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. పద్మనాభం జంక్షన్, కృష్ణాపురం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, కురపల్లి తదితర గ్రామాల్లో అరగంట సేపు వర్షం కురిసింది. సాయంత్రం ఆరు నుంచి 6.30 గంటల వరకు కురిసిన వానతో రోడ్లపై నీరు ప్రవహించింది. వర్షం ఈ గ్రామాల్లో వేసిన వరి పంటకు మేలు చేకూర్చింది.

వేతన ఒప్పందంపై విశాఖ పోర్టు కార్మికుల హర్షం

సాక్షి, విశాఖపట్నం : మేజర్ పోర్టుల కార్మికుల వేతన సవరణకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ ఆమోదం తెలిపారు. ఇరుపార్టీల వేతన చర్చా కమిటీ, ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ పరస్పర అంగీకార పత్రాలపై బుధవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 2021 డిసెంబర్ 31 నాటి ప్రాథమిక వేతనంపై 8.5 శాతం లబ్ధి, 2022 జనవరి 1 నాటికి 30 శాతం వీడీఏ అదనంగా అందజేయనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఈ వేతన ఒప్పందం వల్ల కార్మికులకు న్యాయం చేసే దిశగా కీలక ముందడుగు వేస్తున్నట్లు అవుతుందని శర్బానంద సోనోవాలా తెలిపారని విశాఖ పోర్టు చైర్మన్ డా.అంగముత్తు వెల్లడించారు. చర్చలు ఫలప్రదంగా సాగడంలో సానుకూలంగా వ్యవహరించిన కార్మిక సంఘా లు, ఇండియన్ పోర్టు అసోసియేషన్ ప్రతినిధులను మంత్రి ప్రశంసించారు. వేతన ఒప్పందానికి సంబంధించి కార్మిక సంఘాలు 28న నిరవధిక సమ్మెకు పిలుపునివ్వగా.. కేంద్ర మంత్రి జోక్యంతో దేశంలోని 12 మేజర్ పోర్టులకు సంబంధించిన కార్మిక నేతలు సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. చర్చల అనంతరం జరిగిన ఒప్పందం మేరకు 2022 జనవరి 1 నుంచి 2026 డిసెంబర్ 31 వరకు ఐదేళ్ల కాల పరిమితికి వేతన సవరణలు అమలు చేయనున్నట్లు పోర్టు చైర్మన్ తెలిపారు. సమ్మెను విరమింపజేయడంలో తీసుకున్న చొరవపై ఆరు కార్మిక సంఘాల ప్రతినిధులు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

కణితి హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

అగనంపూడి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విశాఖ జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు కణితి హైస్కూల్ ఎంపికైంది. 180 పాయింట్ల తో జిల్లాలో అగ్రగామిగా నిలిచింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వివరాలను వెల్లడించింది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. ఎస్‌జీఎఫ్ నిర్వహించిన క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కణితి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమంలో స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును అందుకోనున్నామని హెచ్‌ఎం ప్రకాశరావు,పీడీ మన్నాజీ, నారాయణరావు తెలిపారు.

మెడపై కత్తి పెట్టి బెదిరించిన ముగ్గురి అరెస్టు

మధురవాడ: బెంగళూరులో ఐటీ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న చంద్రంపాలేనికి చెందిన వ్యక్తి మెడపై కత్తి పెట్టి బెదిరించి రూ.1,300 నగదు తీసుకున్న ముగ్గురు వ్యక్తులను పీఎం పాలెం క్రైం పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి పీఎం పాలెం క్రైం ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

చంద్రంపాలెం భరత్‌నగర్‌కు చెందిన నేమాని వెంకట్ బెంగళూరులో పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఈ నెల 24వ తేదీ రాత్రి 11గంటలు సమయంలో తన తండ్రి గౌరీశంకర్‌కు మందులు తేవడం కోసం కార్ షెడ్ జంక్షన్ వద్ద గల స్వింగర్ బార్ వద్దకు వచ్చి నిలబడి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వమని బెదిరించారు. దీంతో రు.300ఇచ్చాడు. అయినప్పటికీ సదరు వ్యక్తులు వదలకుండా మెడపై కత్తి పెట్టి బెదిరించి తన పేటీఎం ఖాతా నుంచి మూడు ధఫాలుగా రు.2, 500 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అయితే ఇందులో వెయ్యి రూపాయలు మాత్రమే సదరు వ్యక్తుల అకౌంట్‌కు క్రెడిట్ అయ్యింది. ఈ క్రమంలో వారి నుంచి తప్పించుకుని పరిగెత్తుతూ రోడ్డుపై పడిపోవడంతో మోకాళ్లపై గాయాలు అయ్యాయి. దీంతో వెంకట్ మంగళవారం పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి శ్రీకాకుళం సంపత్‌నగర్ దగ్గర సాయిప్రియ గార్డెన్‌కు చెందిన చేట్ల చంద్రశేఖర్ రెడ్డి (23), కొమ్మాది రిక్షా కాలనీకి చెందిన సవడ సురేష్ (24), శివశక్తినగర్ రోడ్డులోని సద్గురు సాయినాథ కాలనీకి చెందిన పారధి కృపానిధి(31)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఐరన్ టేపు, వివో సెల్‌ఫోన్, హోండా డియో స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.వెంకటరావు తెలిపిన వివరాలు..ఎండాడ విజయ సూర్యారెసిడెన్సీలో నివసిస్తున్న మల్లిపూడి జ్యోతిర్మయి కుమారుడు త్రివిక్రమ ఆదిత్య చౌదరి (21) గీతం కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. చంద్రంపాలెంలో ఉంటున్న తన స్నేహితుని ఇంటికి మంగళవారం వెళ్లిన ఆదిత్య, బుధవారం తిరిగి ఎండాడకు బైక్‌పై వస్తుండగా దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు.

కొమ్మాది కూడలిలో..

కొమ్మాది హౌసింగ్ బోర్డు కాలనీ 8వ బ్లాకులో నివసిస్తున్న యల్లా భాస్కర్ (40)బుధవారం ఉదయం 11 గంటలకు కుమార్తెను తీసుకుని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొమ్మాది కూడలిలో ఆగి ఉన్న కారు డోర్ తెరవడంతో కుమార్తెతో పాటు ఆయన కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. భాస్కర్ గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారుతో పాటు పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రహదారి విస్తరణకు సహకరించండి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- వర్తకులు, గృహ యజమానులతో సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలిలో రోడ్ల విస్తరణకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద వర్తకులు, గృహ యజమానులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ మెయిన్‌రోడ్డు, బ్యాంకు రోడ్డు, బీచ్‌రోడ్డు మొదలైన ప్రాంతాల్లో సంవత్సరాల క్రితమే రోడ్ల విస్తరణ జరగాల్సి ఉన్నా, వాయిదా పడుతూ వస్తోందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జాప్యం లేకుండా తప్పనిసరిగా విస్తరణ జరగాల్సి ఉందని, ఇది అందరికీ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డు పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉన్నందున వ్యాపారులు, గృహ యజమానులు సహకరించాలని కోరారు. ఆయా రోడ్లు ఏ మేరకు ఎంత వెడల్పు విస్తరించాలి? దాని వల్ల ఎన్ని షాపులు, నిర్మాణాలు తొలగించాలి? ఎంత నష్టపరిహారాలు అందించాలన్న వివరాలపై వారం రోజుల్లో నివేదికను అందించాలని అధికారులను కోరారు. అలాగే నిర్మాణాలను కోల్పోయేవారికి జాప్యం లేకుండా నష్టపరిహారాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

భీమిలి

9493185214